# అరచేతిలో.. ఆరు సాగర సేవలు

- సునామీ ఎప్పుడు.. చేపలెక్కడ?
- తీర ప్రాంతాల సంక్షేమం, రక్షణ తదితరాలు
- 'ఐడీఎస్'తో అందుబాటులోకి తెచ్చిన ఇన్‌కాయిస్




సముద్రంలో సునామీ రాకను తెలిపే 'బూయ్స్' (పసుపు రంగులోనివి)

ఈనాడు – హైదరాబాద్

తీరప్రాంత సమాచార వ్యవస్థలో భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవా కేంద్రం(ఇన్‌కాయిస్) సరికొత్త అధ్యాయం సృష్టించింది. గుజరాత్ నుంచి పశ్చిమబంగ వరకు సముద్రతీరంలో నివసించే అరకోటికిపైగా ప్రజలు, రక్షణ వ్యవస్థలను అనుసంధానం చేసింది. మత్స్యకారుల కుటుంబాలతోపాటు విపత్తు నిర్వహణ అధికార బృందాలు, మత్స్యశాఖలు, ఇతర వ్యవస్థలను కలిపి సమీకృత ప్రచార వ్యవస్థను(ఇంటిగ్రేటెడ్ డిస్సెమినేషన్ సిస్టమ్-ఐడీఎస్) రూపొందించింది. ఐడీఎస్ ద్వారా ఏయే రకాల చేపలు ఎక్కడ లభిస్తాయనే సమాచారాన్ని అందించడం నుంచి సునామీ, భూకంపాల తీవ్రత, వాటి ప్రభావం, పొంచి ఉన్న ఇతర విపత్తులపై తీర ప్రాంతాన్ని అప్రమత్తం చేస్తామని ఇన్‌కాయిస్ చెబుతోంది.

సముద్రగర్భంలో తలెత్తే పరిణామాలు భూ ఉపరితలంపై వాతావరణాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తాయి. వాతావరణ మార్పుల నుంచి సహజ వనరుల వరకు అనేక అంశాలు సముద్రంతో ముడిపడి ఉంటాయి. వాటిపై క్షణక్షణం పరిశోధనలు చేస్తోన్న ఇన్‌కాయిస్ గత పదేళ్లలో అనేక మైలురాళ్లు చేరుకుంది. ఇప్పటికే ప్రపంచంలోనే అత్యంత వేగంగా సునామీ సమాచారాన్ని కనుగొనే వ్యవస్థను అండమాన్‌లో నెలకొల్పి రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.




ఐడీఎస్ ద్వారా అందే సేవలు, అంతిమ వినియోగదారుల జాబితా

## ■ ఐడీఎస్ ద్వారా లభించే సేవలు..

ఉపగ్రహాల ద్వారా ప్రతి రోజూ సముద్ర ఉపరితలంపై ఉన్న ఉష్ణోగ్రత, నీటిలో పత్రహరితం అందుబాటులో ఉన్న ప్రాంతాల చిత్రాలు వస్తాయి. చేపలకు పత్రహరితం ఆహారం. తక్కువ ఉష్ణోగ్రత, పత్రహరితం ఎక్కువ ఉండే ప్రాంతాలకు చేపలు వలసవెళ్తుంటాయి. ఇతర ప్రామాణికాలనూ విశ్లేషించి చేపలు లభించే ప్రాంతాలను ఇన్‌కాయిస్ తెలియజేస్తుంది. ఖరీదైన టూనా చేపలు ఎక్కడెక్కడున్నాయో చెబుతుంది. సముద్ర వాతావరణం, కెరటాలు, సునామీ సమాచారం, సముద్రంలో తలెత్తే తుఫానులను ఎప్పటికప్పుడు పూర్తి విశ్లేషణతో చేరవేస్తుంది. ఐడీఎస్‌తో ఈ సేవలన్నీ మొబైల్ యాప్, చరవాణిలకు ప్రాంతీయ భాషల్లో సంక్షిప్త సందేశాలు, వాయిస్ కాల్స్, ఈమెయిల్స్, ఫ్యాక్స్, సామాజిక మాధ్యమం, సెన్సార్లతో పనిచేసే డిజిటల్ బోర్డులు, గ్లోబల్ టెలికమ్యునికేషన్ వ్యవస్థ, రేడియో, టీవీ, క్లౌడ్ చానెల్స్ ద్వారా అందుతాయి. అందుకు సంబంధించి అంతిమ వినియోగదారుల చరవాణి, ఫ్యాక్స్ నెంబర్లు, ఇతర వివరాలను శాస్త్రవేత్తలు డేటాబేస్‌లో పొందుపరుస్తున్నారు.

## జూన్‌లో యాప్..

ఐడీఎస్ సేవల్ని మొబైల్ యాప్ సాయంతో సాధారణ ప్రజలూ అందిపుచ్చుకోవచ్చు. ఇన్‌కాయిస్-ఐడీఎస్ పేరుతో జూన్‌లో మొబైల్‌యాప్‌ను విడుదల చేయనున్నాం.

– ఇ.పట్టాభి రామారావు,
సీనియర్ శాస్త్రవేత్త, ఇన్‌కాయిస్

## ప్రజల సంక్షేమం, రక్షణ కోసం..

తీరప్రాంత రక్షణ దళాలు, నౌకాదళం, విపత్తు నిర్వహణ అధికార బృందాలు(ఎన్‌డీఆర్ఎఫ్), స్వచ్ఛంద సంస్థలు, పరిశోధన సంస్థలు, ఆయా రాష్ట్రాల మత్స్యశాఖలు సైతం తీరప్రాంతంలో పనిచేస్తుంటాయి. వాళ్లతోపాటు సాధారణ ప్రజలకూ సమగ్ర సమాచారం ఇవ్వాలని 'ఐడీఎస్'ను రూపొందించాం. సునామీలు, భూకంపాలు, సముద్ర తుఫానులు, ఇతర విపత్తులు, ప్రమాదాల నుంచి ప్రజల్ని రక్షించేందుకు ఈ వ్యవస్థ పూర్తిగా ఉపయోగపడుతుంది.

– డాక్టర్.ఎస్.ఎస్.సీ.శెనాయ్,
సంచాలకులు, ఇన్‌కాయిస్